క్లుప్తంగా

చిత్రకళ పోటీలకు స్పందన


బహుమతులతో విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రంగుల గోధమ్మ చిత్రకళ పోటీలు నిర్వహించారు. పోటీలకు విద్యార్థుల నుంచి భారీ స్పందన వచ్చింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా చిత్రకళ పోటీలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్ తెలిపారు. పోటీలలో రాణించిన విద్యార్థులు, యువతులకు బహుమతులు ప్రదానం చేశారు. వైస్‌చైర్మన్ గంట వెంకటేశ్‌గౌడ్, అర్చకులు నవీన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

వీర్నపల్లి: యువత క్రీడల్లో రాణించాలని ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లారపు అరుణ్‌కుమార్ మండలకేంద్రంలో వాలీబాల్ క్రీడాకారులకు ఆదివారం క్రీడా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలన్నారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఉంటుదన్నారు.

10న రాణా దివస్

చందుర్తి : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 10న ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఉదయం 10.30లకు రాణా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సెస్ డైరెక్టర్

గంభీరావుపేట: గ్రామాల్లో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని సెస్ మండల డైరెక్టర్ గొరినేని నారాయణరావు అన్నారు. మండలంలోని రాజుపేటలో రూ.4లక్షల అంచనాతో ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ప్రారంభించారు. రైతులకు సమస్య లేకుండా చూస్తామన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, వదులుగా ఉన్న విద్యుత్ తీగలు సరిచేసే పనులను చేపట్టినట్లు తెలిపారు. సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన మేరుగు శ్రీనివాస్ గతనెల 26న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తోటి స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.20వేలు నగదు ఆర్థికసాయంగా అందజేశారు. ఇక్కడ బుర్ర బాలకిషన్, దుద్దెటి పర్శరాములు, కొలనూరి పూర్ణచందర్, సాంబరాథ, కమల, సౌజన్య, వనిత, షాకెరా, మాధవి, కొలనూర్, బావుసాయిపేట ఎంపీటీసీలు ప్రవీణ్‌కుమార్, షేక్ యాస్మిన్‌పాషా తదితరులున్నారు.

రంగవల్లులు.. హరివిల్లులు



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని బీవైనగర్‌లో ఆదివారం టీమ్39 ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ఈ పోటీల్లో 224 మంది మహిళలు పాల్గొన్నారు. జడ్జిగా వైద్యురాలు పి.శోభారాణి వ్యవహరించారు. స్థానిక కౌన్సిలర్ తుమ్మ రాధతో కలిసి విజేతలకు బహుమతులు అందించారు. బీఆర్‌ఎస్ నాయకుడు తుమ్మ రాజు, నిర్వాహకులు లవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కోనరావుపేట: మండలంలోని మల్కపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి కట్ల భీరయ్య, సాదుపల్లి సత్తయ్య రూ.5016 చొప్పున విరాళం అందజేశారు. మల్కపేటలో శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని తొలగించి నూతనంగా ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఇందుకు గ్రామస్తులు తమవంతు విరాళాన్ని ఉపసర్పంచ్ జవ్వాజి అంజయ్యకు అందజేశారు. ఆరె మహేందర్ తదితరులున్నారు.

బెల్టుషాపులు మూసివేయాలి

గంభీరావుపేట: గ్రామాల్లో కొనసాగుతున్న మద్యం బెల్ట్‌షాపులను మూసివేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం ఎక్సైజ్ అధికారులను డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం బెల్ట్‌షాపులను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ఇంకా గ్రామాల్లో దుకాణాలు కొనసాగుతున్నాయన్నారు. బెల్టుషాపులు మూసివేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు రఘు, ప్రేమ్‌కుమార్, బాబు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై సందిగ్ధం

- రెండో విడత పంపిణీలో ఆలస్యం
- సర్కార్ మార్పుతో లబ్ధిదారుల ఆందోళన
- జిల్లాలో 4,628 మంది లబ్ధిదారులు
- డీడీలు చెల్లించిన 20117 మంది
- రెండో విడతలో 548 యూనిట్ల గ్రౌండింగ్



ముస్తాబాద్: రెండో విడత గొర్రెల పంపిణీపై సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వ మార్పుతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో లబ్ధిదారు వాటా చెల్లించిన వారు గొర్రెలు వస్తాయో లేదో అన్న సందేహంలో ఉన్నారు. నాలుగేళ్ల క్రితం మొదటి విడతలో గొర్రెలు అందించిన ప్రభుత్వం రెండోవిడత పంపిణీకి పచ్చజెండా ఊపినా అనుకున్న స్థాయిలో లక్ష్యం నేరవేరలేదు. దీంతో గొల్ల కురుమలకు నిరాశే ఎదురైంది. ఆరునెలల క్రితమే వాటాధనం చెల్లించినా గొర్రెల రాకకోసం ఎదురుచూస్తున్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న గొర్రెల యూనిట్ల గ్రౌండింగ్ ఎప్పటికీ పూర్తయ్యేనని గొల్ల కురుమలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో గొర్రెల పంపిణీ లక్ష్యం

జిల్లాలో 13 మండలాల్లో రెండోవిడత గొర్రెలు అందించేందుకు అధికారులు 4,628 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఇందులో 2017 మంది గొల్ల కురుమలు వాటాధనం కింద రూ.43,750 డీడీ రూపంలో చెల్లించారు. ప్రభుత్వ సబ్సిడీ రూ.1.32లక్షలు. మొత్తం యూనిట్ ధర రూ.లక్షా 75వేల 750. ఇందులో డీడీలు చెల్లించిన 2017 మందిలో ఇప్పటివరకు అధికారులు కేవలం 548 మందికి మాత్రమే గొర్రెలు పంపిణీ చేశారు. ఇంకా 1469 మందికి అందించాల్సి ఉంది. అప్పులు చేసి వాటాధనం చెల్లించామని, ఆరు నెలలైనా గొర్రెల పంపిణీ జాడ లేదని బందనకల్ గొల్ల కురుమలు ఆందోళన చేపట్టడం పరిస్థితికి అద్దం పడుతోంది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి పర్యటనలో తమ ఆవేదనను వెలిబుచ్చారు.

8వేలమంది గొల్ల కురుమలు

జిల్లాలో అర్హులైన వారిని గుర్తించారు. 18 ఏళ్ల నిండినవారికి కూడా అవకాశం కల్పించారు. 8వేల మంది అర్హులను గుర్తించిన ప్రభుత్వం మొదటి విడతలో 3,755 మందికి గొర్రెలు అందించారు. రెండో విడతలో 4,628 మందిని గుర్తించగా అనుకున్న స్థాయిలో యూనిట్ల గ్రౌండింగ్ కావడం లేదు. మొదటి విడతలో లబ్ధిదారుని వాటాధనం రూ.31వేల 250 ఉండగా పెరిగిన ధరలతో రెండో విడతలో రూ.43,750గా నిర్ణయించారు. రెండో విడతలో లబ్ధిదారుడు రూ.12వేల 500 ఎక్కువగా చెల్లిస్తున్నారు. ఒకో యూనిట్‌లో 20 గొర్రెలతో ఒక్క పొట్టేలును అందిస్తారు.

ఆందోళనలో గొర్ల కాపరులు

బీఆర్‌ఎస్ సర్కార్ పోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గొర్రెల పంపిణీ ఆగిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. గొల్ల కురుమలు రెండో విడత పంపిణీ కోసం ఆరునెలల క్రితమే వాటాధనం చెల్లించారు. డీడీలు చెల్లించిన లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొర్రెల ఇవ్వకపోతే డీడీలైనా వాపస్ ఇవ్వాలని కోరుతున్నారు.

లభ్యం కాని గొర్రెలు..

గొర్రెలకోసం లబ్ధిదారులు, అధికారులు ఇంతకుముందు ఆంధ్రబాట పట్టారు. కడప, అనంతపూర్, నెల్లూరు, కర్నూలు జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటుండగా అక్కడ గొర్రెలు అనుకున్న స్థాయిలో లభించలేదు. చాలామంది ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రెండునెలల క్రితం పర్యటించి గొర్రెల కోసం వెతికారు.

మార్గదర్శకాలు రాలేదు



గొల్ల కురుమలకు అవగాహన కల్పిస్తున్నాం. కొత్త ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వ సబ్సిడీ విడుదల కాగానే గొర్రెల కోసం ఆంధ్రకు పంపిస్తాం. ఎవరూ ఆందోళన చెందొద్దు. ఇంకా డీడీలు చెల్లించని వారు వేలల్లో ఉన్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుతాం. – కొమురయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

ఆరునెలల క్రితమే డీడీలు చెల్లించాం



మేము ఆరునెలల క్రితమే డీడీలు కట్టాం. ఈలోగా ఎన్నికలు వచ్చాయి. ఎన్నికలు అయ్యాక.. గొర్లు వస్తాయని అనుకున్నాం. ఇప్పుడు ప్రభుత్వం మారింది. దీంతో పైసలు కట్టిన వారు ఆందోళన చెందుతున్నారు. ముస్తాబాద్‌లో ఇంకా ముప్పైమందికి గొర్లు రావాలే. – చెవుల మల్లేశ్, ముస్తాబాద్

గొర్రెలు దొరుకుతలేవని..



గొర్ల కోసం ఎదురుచూస్తున్నం. అప్పట్లో కొందరు గొర్లకోసం పోయి వచ్చిరంట. మళ్ల గొర్లు దొరుకుతయో లేదోనని పైసలు కట్టలే. మా సంఘంలో పెద్ద మనుషులు ఇంకా డీడీలు కట్టమని చెప్పలేదు. గొర్లు వస్తయంటే పైసలు కడుతామనుకుంటున్న. – మందాటి చంద్రయ్య, గూడెం

కొత్త సర్కార్ ఇయ్యాలే



గొర్రెలు వత్తయంటే అప్పులు చేసి పైసలు కట్టినం. కొత్త సర్కార్ అయిన గొర్లు వచ్చేటట్టు చూడాలే. అసలు గొర్లు వత్తయా రావా చెప్పాలే. లేకపోతే డీడీలు వాపసు అయిన చేయాలే. కొత్త యూనిట్ల మంజూరుపై స్పష్టత ఇవ్వాలి. – రాయం రాజు, బందనకల్

పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట: ఎస్జీటీలకు నిలిచిపోయిన బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌పీటీఏ నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు చెల్లించకుండా ట్రెజరీలోనే మూలుగుతున్న బకాయిలను ఎన్నికల హామీ మేరకు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శులు ప్రశాంత్, రాజు, కార్యదర్శులు రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్మశాలీ సేవాసంఘం అధ్యక్షుడిగా రాజమల్లయ్య



ముస్తాబాద్: మండలకేంద్రంలోని మార్కండేయ పద్మశాలీ సేవాసంఘం అధ్యక్షుడిగా గూడూరి రాజమల్లయ్య ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చిలువేరి ధర్మయ్య, ఉపాధ్యక్షులుగా పాశికంటి నాగులు, ప్రధాన కార్యదర్శిగా మ్యాన మల్లేశం, కార్యదర్శిగా మాదాసు యాదగిరి, కోశాధికారిగా కొంక రాజు, కార్యవర్గ సభ్యులుగా అవదూత శేఖర్, యాదారపు రాజు, నర్సింలు, పాశికంటి సత్యనారాయణ, కొండ సంతోష్ ఎన్నికయ్యారు.

అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్ర


ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లో ఇంటింటా అక్షింతల పంపిణీ


బోయినపల్లి: వెంకట్రావుపల్లిలో విగ్రహాలతో భక్తుల శోభాయాత్ర

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్, అల్మాస్‌పూర్, బండలింగంపల్లి గ్రామాల్లో ఆదివారం అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటా అక్షింతలు పంపిణీ చేశారు. నారాయణపూర్, అల్మాస్‌పూర్‌లో మొదట అక్షింతలను శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచులు నిమ్మ లక్ష్మి, కొత్తపల్లి వాణి, ఎంపీటీసీలు అపెరా సుల్తానా, కొత్తపల్లి పద్మ, వేద పండితులు వేణుగోపాలచారి, పురుషోత్తమచారి, శ్రీనివాస శర్మ, భజన మండలి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి, కొదురుపాక, తడగొండ గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షితల శోభాయాత్ర ఆదివారం నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి అక్షింతలు తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూర్గుల నందయ్య, గుడి రవీందర్ రెడ్డి, చేపూరి మహిపాల్, మినుకుల శ్రీనివాస్, గోగూరి దామోదర్‌రెడ్డి, అంజయ్య, కొండ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయంలో భజనలు, ప్రత్యేక పూజలు, స్వామివారికి అభిషేకాలు చేశారు. ఆలయంలో గతనెల 17న ప్రారంభమైన ధనుర్మాస మహోత్సవాల వేడుకలు ఈనెల 14 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, ప్రధాన అర్చకులు నవీన్‌చారి తెలిపారు. ఈనెల 9న మంగళశాసనం, 10న రేపల్లె వేడుకలు, 11న అలంకరణ, సారె, 12న శ్రీ గోదారంగనాథుల స్వామి కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్నిఏర్పాట్లు చేస్తున్నట్టు చైర్మన్ జితేందర్ పేర్కొన్నారు. అదేరోజు కల్యాణం అనంతరం స్వామివారి లడ్డూ ప్రసాదానికి వేలం జరుగుతుందన్నారు.

కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న విశ్వనాథ్

వేములవాడ: వేములవాడ వాసవీక్లబ్ డివైన్ 2024 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దైత సంపత్ కుమార్, సెక్రెటరీగా బొమ్మకంటి శ్రీకర్ గుప్తా, ట్రెజరర్‌గా ఎర్రవెల్లి గణేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథం శ్రీనివాస్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా వి–103 ఏ గవర్నర్ గాదె సుదర్శన్ గుప్తా, వైస్ గవర్నర్ నరాల శ్రీనివాస్, రీజనల్ చైర్‌పర్సన్ కిరణ్‌కుమార్, రీజనల్ సెక్రటరీ సిద్ధంశెట్టి వేణు, జోనల్ చైర్ పర్సన్ కొమురవెల్లి సంతోష్, పట్టణ సంఘం అధ్యక్షుడు రేణిగింది అశోక్, మాజీ అధ్యక్షుడు కటకం జనార్దన్, వాసవిక్లబ్ మాజీ వైస్ ప్రెసిడెంట్ యాద సంతోష్, మాజీ సెక్రటరీ నరాల శ్రీధర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవి క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా పడమటింటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గందె చంద్రం, కోటగిరి దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా పప్పుల శ్రీకాంత్, కోశాధికారిగా పప్పుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బొందుగుల శ్రీనివాస్, చంద్రం, నగేశ్, గందె శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, భాస్కర్, భద్రయ్య, గరిపెల్లి రమేశ్, సలహదారుగా మాచెట్టి లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు.

ఆన్‌లైన్‌లో ప్రజాపాలన దరఖాస్తులు

తంగళ్లపల్లి: మండలవ్యాప్తంగా అన్నిగ్రామాల నుంచి ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో పి.లచ్చాలు తెలిపారు. ఆదివారం సెలవు దినం అయినా కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఎంపీడీవో పి.లచ్చాలు, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్ రెడ్డి పర్యవేక్షించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో షిఫ్టుల వారీగా ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మండలంలోని 23 గ్రామాల నుంచి 12,634 అభయహస్తం దరఖాస్తులు అధికారులకు అందాయి. మరో 2200 ఇతర దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 2,300 దరఖాస్తుల వరకు డాటా ఎంట్రీ చేసినట్లు ఎంపీడీవో నల్లా రాజేందర్ రెడ్డి తెలిపారు.

అక్షింతల కోసం నిరసన

వేములవాడరూరల్: అయోధ్య రాముడి అక్షింతలు కొందరికే ఇస్తూ తమను విస్మరించారంటూ పలువురు నిరసన తెలిపిన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి వార్డులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. శనివారం కోనాయపల్లిలో అయోధ్య రాముడి అక్షింతలను కొందరు ఇంటింటికీ అందించారు. ఇదే గ్రామానికి చెందిన పలువురికి అక్షింతలు అందలేదని తమను తక్కువ చేశారన్న భావనతో చర్చలు జరిగాయి. ఆదివారం పలువురు రోడ్డుపై నిరసన తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

రోడ్డు ప్రమాద ఘటనపై ఎస్సై విచారణ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ శివారులో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనపై ఆదివారం పోలీసులు విచారణ జరిపారు. రోడ్డుపై వెళ్తున్న వెంకటాపూర్‌కు చెందిన ఓ ముస్లిం వ్యక్తిని ఎల్లారెడ్డిపేటకు చెందిన సతీశ్ అనే వాహనదారుడు బైక్‌తో ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. మొదట సిరిసిల్ల ఏరియా సుపత్రికి అనంతరం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్సై రమాకాంత్ విచారణ జరిపి సతీశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

వేములవాడ అర్బన్ : వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌కు చెందిన ఓ బాలుడిని ఆదివారం కారు ఢీకొని గాయపడ్డాడు. క్షతగాత్రున్ని వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుని తలకు గాయమైనట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులోని బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ముగ్గురిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న రాచర్ల గొల్లపల్లికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. కానిస్టేబుళ్ల సతీశ్, ప్రకాశ్, తదితరులున్నారు.

అనాథ బాలికకు చేయూత

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): చిన్నతనంలోనే తల్లిదండ్రులిద్దరినీ కోల్పోవడంతో ఓ బాలిక అనాథగా మారింది. మండలకేంద్రానికి చెంది న మహమ్మద్ తాజ్–బాబా అనే దంపతులిద్దరూ ఇటీవల అ నా రోగ్యంతో మృతిచెందారు. దీంతో సోని అనాథగా మారింది. ఈ విషయం వార్డుసభ్యుడు పందిర్ల శ్రీనివాస్ ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్ రూ.10వేలు, 50 కిలోల బియ్యం అందించారు. దాతలు ముందుకువచ్చి చేయూతనందించాలని గ్రామస్తులు, కోరుతున్నారు.

ముదురుతున్న వివాదం

- ఆలయ ఆదాయాన్ని పూజారులు స్వాహా చేస్తున్నారని కమిటీ సభ్యుల ఆరోపణ

చందుర్తి : మండలంలోని నర్సింగాపూర్‌లో మోహినికుంట శ్రీమల్లికార్జున స్వామి దేవాలయ కమిటీ సభ్యులు, పూజారులకు మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతోంది. దేవాదాయ శాఖ పరిధిలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయానికి స్వామివారికల్యాణం, కొబ్బరికాయల టికెట్ల నుంచి వచ్చే ఆదాయాన్ని జమచేయాల్సిన పూజారులు టికెట్లు లేకుండా పూజలు నిర్వహిస్తూ డబ్బులను వారే స్వీకరిస్తూ ఆలయ ఆదాయానికి గండికొడుతున్నారని కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆదివారం పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఉపసర్పంచ్ కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఇరువురిని మందలించారు. ఏదైనా ఉంటే మరోరోజు మాట్లాడుకోవాలని తెలపడంతో అక్కడినుంచి వెళ్లారు.

విద్యార్థులకు రక్షణ కరువు


మండలకేంద్రంలో ప్రహరీ లేని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- పాఠశాలలకు ప్రహరీలు లేక.. ప్రాణాలు అరచేతిలో
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- ప్రతిపాదనలకే పరిమితం

గంభీరావుపేట: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కరువైంది. పాఠశాలలకు వెళ్లే తమ పిల్లలకు భద్రత కరువైందని, ఇంటికి వచ్చేదాకా ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనందిస్తున్నామని చెబుతున్నా చాలా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పాఠశాలల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు విశ్రాంతి సమయంలో బయటకు వెళ్తున్నారు. ఆటలాడుతూ రోడ్లపైకి వెళ్లడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పశువులు, కుక్కలు, పందులు, కోతులు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. కొన్ని బడుల్లోకి పాములు, విషపురుగులు, కీటకాలు చేరడంతో భయాందోళనకు గురవుతున్నారు. దీంతో సెలవు రోజుల్లో బడి ప్రాంగణం అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. రహదారి పక్కనే ఉన్న పాఠశాలల్లో సమస్య తీవ్రంగా ఉంది.

ప్రహరీలు లేని పాఠశాలలివే..

మండలంలో 29 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 12 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో పలు పాఠశాలలకు ప్రహరీలు లేవు. మండలకేంద్రంలోని దోసలగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఉన్న ప్రహరీని రోడ్డు విస్తరణలో భాగంగా రెండేళ్ల క్రితం కూల్చేశారు. కొత్తగా నిర్మాణం చేపట్టేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ముస్తఫానగర్, కొత్తపల్లి తండా, తుర్కాశిపల్లె, లక్ష్మీపూర్, కొత్తపల్లి ఎస్సీ కాలనీ, లింగన్నపేట ఎస్సీ కాలనీల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్ లేక కష్టాలు తప్పడం లేదు. డైస్‌లో ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు నివేదించారు. కానీ నిధులు మంజూరు కావడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంపౌండ్ వాల్ నిర్మించాలి



దోసలగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉంది. బడిలోనే రెండు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు విద్యార్థులకు ఏం జరుగుతుందోనని భయపడాల్సి వస్తోంది. అధికారులు త్వరగా స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నాం. – వంశీ, గంభీరావుపేట

అవస్థలు పడుతున్నారు



పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. పశువులు, పందులు, కుక్కలు, పాఠశాలకు వస్తున్నాయి. విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అధికారులకు కాంపౌండ్ వాల్ గురించి విన్నవించాం. – దోసల చంద్రం, విద్యాకమిటీ చైర్మన్, గంభీరావుపేట

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం దాచారంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం సీజ్ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన గౌరవేని రమేశ్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లు సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు సత్యనారాయణ, భూమయ్య, కానిస్టేబుళ్లు తిరుపతి, చంద్రశేఖర్, శ్రీకాంత్ ఎస్సై అభినందించారు.